క్లుప్తంగా

చికిత్స పొందుతున్న వృద్ధురాలి మృతి



ఎల్కతుర్తి : ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడిన ఓ వృద్ధురాలు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ముల్కనూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమదేవరపల్లి మండల కేంద్రానికి చెందిన పోలు చంద్రమ్మ (91) బుధవారం గ్రామంలోని కస్టమర్ సర్వీస్ పాయింట్ వద్ద పింఛన్ డబ్బులు తీసుకొని వస్తున్న క్రమంలో సత్రబోయిన రాజేష్ ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా, అతివేగంగా నడుపుతూ రివర్స్ తీస్తున్న క్రమంలో చంద్రమ్మకు ఢీకొట్టింది. దీంతో ఆమె కిందపడిపోయి తీవ్రంగా గాయపడింది. స్థానికులు చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ ఆస్పత్రికి తరలించారు. కాగా పరిస్థితి విషమించి చంద్రమ్మ మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి కుమారుడు పోలు నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముల్కనూరు పోలీసులు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జలుగూరి రవీందర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి గురువారం రవీందర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం రవీందర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట నాయకులు గుర్రం రవీందర్, సారయ్య, మహేందర్, రమేష్ ఉన్నారు.

వేలేరులో..

వేలేరు : మండల కేంద్రానికి చెందిన జిల్లెల పెరుమయ్య, పులి ఎల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న 'కుడా' మాజీ డైరెక్టర్ బిల్లా యాదగిరి గురువారం పరామర్శించారు. అనంతరం ఒక్కో కుటుంబానికి 50 కేజీల చొప్పున బియ్యం అందించారు. మల్లయ్య, దుర్గరాజు, సంపత్ రెడ్డి, ఖాసీం పాల్గొన్నారు.

ఏసీపీకి ఆహ్వానపత్రం అందజేత



శాయంపేట : అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేడు పట్టణంలో ప్రారంభించనున్న సమ్మర్ ప్రత్యేక క్యాంపు ప్రారంభోత్సవంలో పాల్గొనాలని కోరుతూ పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్‌కు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అమ్మ అశోక్ కోరారు. ఈ మేరకు గురువారం ఆహ్వానపత్రం అందించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. నాలుగు ఏళ్ల పైబడిన ప్రతిఒక్కరికి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్, ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్‌పై ప్రత్యేక శిక్షకుడు కోమినేని రఘు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 45రోజుల పాటు కంట్రీ ఆఫ్ కరెన్సీ, భారతదేశంలోని రాష్ట్రాలు, జిల్లాలు, మండలాలు, గ్రామాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి అయిన అనంతరం జిల్లా కలెక్టర్ సన్మానించనున్నట్లు తెలిపారు. దాసరి రవి, నాగెల్లి సురేష్, రాసమల్ల కృష్ణ, పాలకుర్తి శ్రీకాంత్, గణేష్, అవినాష్ పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

ధర్మసాగర్ : మండలంలోని పెద్దపెండ్యాల గ్రామానికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు గురువారం బీజేపీలో చేరారు. ఈ మేరకు ఆ పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ కండువా కప్పి ఆహ్వానించారు. బీజేపీలో చేరిన వారిలో యాదవ సంఘం అధ్యక్షుడు పెంజర్ల రాజ్‌కుమార్ యాదవ్, ఐలయ్య, గట్టయ్య, శంకర్, రాములు, రాజాలు, రాజయ్య, రవి, రాజు, రాజ్‌కుమార్, వెంకటేశ్, మహేష్, శేఖర్, సప్తగిరి, సాంబరాజు, రాకేష్, అభినయ్, గణేష్ తదితరులు చేరినవారిలో ఉన్నారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలకు అరూరి రమేష్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల, గ్రామ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి రగ్బీకి ఎంపిక

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మోరే సాయిశ్రుతి జాతీయస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ, కోచ్ కరిత తెలిపారు. నేటి నుంచి 26వ తేదీ వరకు పూణేలో జరిగే పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి సాయిశ్రుతి పాల్గొనున్నట్లు తెలిపారు.

పూడికమట్టి.. పంటకు పుష్టి

- పొలాలకు తరలిస్తున్న రైతులు
- పంట దిగుబడికి ఎంతో మేలు
- భూసారం పెరిగి తగ్గనున్న పెట్టుబడి



పూడిక మట్టి కోసం ఉపాధి పనుల వద్దకు వచ్చిన ట్రాక్టర్లు

కమలాపూర్ : ఒకప్పుడు సేంద్రియ వ్యవసాయం చేసిన రైతులు మారుతున్న కాలానికి అనుగుణంగా రసాయనిక ఎరువులతో వ్యవసాయం చేస్తున్నారు. కానీ రసాయనిక ఎరువుల వాడకంతో భూసారం పూర్తిగా తగ్గిపోయి పెట్టుబడులు విపరీతంగా పెరిగుతుండడంతో మళ్లీ సేంద్రియ వ్యవసాయం వైపే మొగ్గు చూపుతున్నారు. తీవ్ర ఎండల కారణంగా సాగు నీటికి ప్రధాన ఆధారాలైన చెరువులు, కుంటలు ఎండిపోతున్నాయి. దీంతో ఎన్నో పోషకాలతో పంట సాగుకు పరిపుష్టిగా ఉండే చెరువులు, కుంటల్లోని పూడిక మట్టిని పంట పొలాల్లో పోసుకునేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇదే సమయంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలతో తీయిస్తున్న పూడికమట్టి పొలాల్లో పోసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్న రైతులకు అధికారులు ఉచితంగా అందిస్తున్నారు. కాగా మరి కొందరు రైతులు ఎండిపోతున్న చెరువులు, కుంటల్లోంచి పూడికమట్టిని ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో పొలాల్లోకి తరలిస్తున్నారు.

పూడిక మట్టి సంజీవని వంటిది



పూడికమట్టి పంటలకు సంజీవని వంటిది. ఎనుకట ఎండా కాలంలో చెరువులు, కుంటలు ఎండిపోతే ఎడ్ల బండ్లతో పూడిక మట్టిని పంట పొలాలకు తరలించుకునేటోళ్లు. ఇప్పుడు యాంత్రిక వ్యవసాయానికి అలవాటు పడి రసాయనిక ఎరువుల వాడకంతో పెట్టుబడులు పెరగడంతో పాటు రోజు రోజుకు భూమిలో సారం లేకుండా పోయి దిగుబడి తగ్గుతోంది. భూసారంతో పాటు పంట దిగుబడి పెంచుకునేందుకు పూడిక మట్టిని పంట పొలాల్లో పోసుకుంటున్నాం.

\- గుత్తికొండ కమలాకర్, వంగపల్లి

పూడికమట్టితో అనేక ప్రయోజనాలు



పూడికమట్టితో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. పంటలకు మేలు చేసే నత్రజని, భాస్వరం, పొటాషియం, మెగ్నీషియం, ఐరన్, జింక్, సేంద్రియ కర్బనం, మొక్కల పెరుగుదలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు ఉంటాయి. బంకమట్టితో తేమ శాతం పెరిగే అవకాశం ఉంటుంది. దీంతో భూమిలో సారం పెరిగి రసాయనిక ఎరువుల వాడకం తగ్గడంతో పెట్టుబడులు తగ్గిపోయి పంట దిగుబడి పెరుగుతుంది. ఇన్ని ప్రయోజనాలున్న పూడికమట్టిని రైతులు తమ వ్యవసాయ భూముల్లో పోసుకోవాలి.

\- జాలి లక్ష్మారెడ్డి, ఏఓ

కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి : ఎర్రబెల్లి



మాట్లాడుతున్న దయాకర్‌రావు

ఐనవోలు : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని కొండపర్తి గ్రామంలో ఆర్యవైశ్య ఫంక్షన్‌హాల్‌లో కొండపర్తి, వనమాల కనపర్తి, నర్సింహులగూడెం గ్రామాల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల, బూత్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వరంగల్‌పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి మారేపల్లి సుధీర్‌కుమార్ గెలుపునకు ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలని ఆయన సూచించారు. 2001 నుంచి డాక్టర్ సుధీర్‌కుమార్ కేసీఆర్ వెంటే ఉంటూ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఉద్యమాలు చేశారన్నారు. కేసీఆర్ దయతో రాజకీయంగా ఎదిగిన వారు నేడు మోసం చేసి ఇతర పార్టీల్లో చేరారని, వారికి గుణపాఠం చెప్పాలని అన్నారు. ఇతర పార్టీల నేతలు బీఆర్ఎస్‌పై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారని, కార్యకర్తలు తిప్పి కొట్టాలని అన్నారు. ప్రజల్లో మార్పు వస్తోందని, కాంగ్రెస్‌కు ఓటేసి మోసపోయామని భావిస్తున్నారని అన్నారు. ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. తన గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. అనంతరం మండల కేంద్రంలో మృతిచెందిన పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. గుజ్జ గోపాల్‌రావు, ఉస్మాన్‌అలీ, తంపుల మోహన్, చందర్‌రావు, సోమేశ్వర్‌రావు, రాజు, సురేష్, సదానందం, దేవేందర్ పాల్గొన్నారు.

నడికూడ : పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ స్థానం నుంచి పోటీ చేస్తున్న సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కోరారు. మండలంలోని రామకృష్ణపూర్, కంఠాత్మకూర్, ధర్మారం, కౌకొండ, సర్వపూర్, వెంకటేశ్వర్లపల్లి, నార్లపూర్, చర్లపల్లి, చౌటుపర్తి, ముస్త్యాలపల్లి గ్రామాలలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో గురువారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించి ఓటు అడుగాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో సుధీర్ కుమార్‌ను గెలిపించి కేసీఆర్‌కు బహుమతిగా ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో ఒడితల ప్రణవ్

కమలాపూర్ : పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కృషిచేయాలని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ అన్నారు. మండలంలోని మాదన్నపేటకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బుధవారం కాంగ్రెస్‌లో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ.. పార్టీలో చేరిన కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని అన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రాణాళిక రూపొందించినట్లు తెలిపారు. గోళ్ల రమేష్, ఎగ్గడి తిరుపతి, రవీందర్, సదయ్య, రాజు, సంపత్, సాంబయ్య, రవీందర్, కుమ్మరి భిక్షపతి, కోడూరి రాజు, కొయ్యడ సాంబయ్య, బైరేని రాజు, కిన్నెర నరేష్, వెంకటేష్, తిప్పని సాంబయ్య, గుండపు సాంబయ్య, నాగపురి రాజమౌళి పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల రక్షణలో నిర్లక్ష్యం



మాట్లాడుతున్న శ్రీధర్

నర్సంపేట : ప్రభుత్వ భూములను పరిరక్షించడంలో రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్ విమర్శించారు. పట్టణంలోని సర్వే నంబర్ 702లోని ప్రభుత్వ భూమిలోని అక్రమ నిర్మాణాలను ఆయన ఆధ్వర్యంలోని బృందం గురువారం సందర్శించి పరిశీలించింది. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడారు. పట్టణంలోని సర్వే నంబర్ 111లో భూమి కొనుగోలు చేసిన పేద వ్యక్తి ఇల్లు కట్టుకుంటుంటే ప్రభుత్వ భూమి అంటూ ఆ శాఖల అధికారులు కూల్చేశారని చెప్పారు. అలాగే సర్వే నంబర్ 702లోని ప్రభుత్వ భూమిలో ఓ సంపన్నుడు రాత్రికి రాత్రే రేకుల షెడ్డు నిర్మిస్తే ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంలోని ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. లంచాలు ఇవ్వరనే కారణంతో పేదల ఇళ్లు కూల్చుతే సంపన్నులు ముడుపులు అప్పగిస్తే ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపట్టినా చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులు భూకబ్జాదారులకు కొమ్ము కాస్తున్నారని మండిపడ్డారు. కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పట్టాలివ్వాలని, ప్రభుత్వ అవసరాలకు ఉపయోగించాలని, సర్వే నంబర్ 702లోని అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ కమిటీ సభ్యుడు కందికొండ రాజు, నాయకులు మొలుగూరి రాజు, దాసరి నరేశ్, మద్దెల నాగరాజు, వీరన్న, వేములపల్లి సుధాకర్, పులిచేరు చందు, జార్జ్ విక్టర్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

27న సర్వసభ్య సమావేశం

కమలాపూర్ : ఈనెల 27వ తేదీన ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గుండె బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభించనున్నట్లు తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రమాదకరంగా హైవే యూటర్న్ పాయింట్లు

- ఏపుగా పెరిగిన మొక్కలు
- అటుగా వస్తున్న వాహనాలు కనిపించని వైనం
- యూటర్న్‌ల వద్ద నిడివి పెంచాలని ప్రయాణికుల వేడుకోలు



ఆత్మకూరులో జాతీయరహదారిపై ప్రమాదకరంగా ఉన్న యూటర్న్ పాయింట్

ఆత్మకూరు : మండల కేంద్రంలోని 163 జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన యూటర్న్ పాయింట్లు ప్రమాదకరంగా మారాయి. వాటిని సురక్షితంగా ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు రోడ్డు దాటడానికి ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని కొత్తబస్టాండు, పోస్టాఫీసు, పాతఅంగడి ప్రాంతాల్లో యూటర్న్ పాయింట్లు ఏర్పాటు చేశారు. అయితే డివేడర్లపై మొక్కలు నాటడంతో అవి ఏపుగా పెరిగాయి. యూటర్న్ పాయింట్ల వద్ద వాహనదారులు రోడ్డు దాటుతుండగా అటుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదని ప్రయాణికులు అంటున్నారు. హైవే అధికారులు యూటర్న్ నిడివి పెంచి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవానలి వాహనదారులు కోరుతున్నారు. కొత్త బస్టాండు యూటర్న్ వద్ద ఏర్పాటు చేసిన డివేడర్ రేకులు విరిగిపోయి ప్రమాదకరంగా మారిందని, గతంలో యూటర్న్‌ల వద్ద ప్రమాదాలు కూడా జరిగాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి యూటర్న్‌ల వద్ద సిగ్నల్ సిస్టం ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

జర్నలిజంతో బంగారు భవిష్యత్‌కు బాటలు



వేణుగోపాల్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

వర్ధన్నపేట : జర్నలిజం విద్యతో బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చని ఖమ్మం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రభుత్వ పాలన శాస్త్ర సహాయ అధ్యాపకుడు డాక్టర్ పి.వేణుగోపాల్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో 'జర్నలిజంలో ఉపాధి అవకాశాలు' అంశంపై ప్రిన్సిపాల్ పోశయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో వేణుగోపాల్ అతిథిగా హాజరై మాట్లాడారు. జర్నలిజం ప్రజాచైతన్యానికి పాటుపడుతుందని చెప్పారు. ప్రజలను ప్రగతిశీల ఆలోచనల దిశగా నడిపిస్తుందని తెలిపారు. సృజనాత్మకత, శ్రమించే తత్వం, భాషపై పట్టు ఉంటే జర్నలిజంలో అత్యుత్తమ స్థాయికి చేరుకోవచ్చన్నారు. ప్రస్తుత సమాజంలో జర్నలిస్టులకు అత్యంత ఉన్నతమైన గుర్తింపు ఉందని చెప్పారు. ప్రిన్సిపాల్ పోషయ్య మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జర్నలిజం కోర్సు అందుబాటులో ఉందని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు జర్నలిజం కోర్సులో చేరి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందాలని సూచించారు. ఫోర్త్ ఎస్టేట్‌గా గుర్తింపు పొందిన మీడియా రంగంలో ప్రతిభ కనబరిస్తే జాతీయ స్థాయికి ఎదగవచ్చని తెలిపారు. అనంతరం వేణుగోపాల్‌ను అధ్యాపకులు శాలువాతో సన్మానించారు. సమావేశంలో అధ్యాపకులు డాక్టర్ ఎం.సమత, సిహెచ్.శ్రీనివాసరావు, బి.శ్రీనివాస్, డాక్టర్ పి.మాలతీలత, ఎన్.శ్రీనివాసరావు, డాక్టర్ కె.సంధ్య, డాక్టర్ బి.శ్వేత, డాక్టర్ పి.సుధారాణి, డాక్టర్ ఎన్.శ్రీనివాస్, కె.జ్యోత్స్న, బి.కృష్ణ, ఎం.దేవేందర్ విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు లక్కీడ్రా

దామెర : తెలంగాణ మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో ప్రవేశాలు పొందేందుకు ఈనెల 27వ తేదీన లాటరీ (లక్కీడ్రా) నిర్వహించనున్నట్లు ఒగ్లాపూర్ (పరకాల) పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశం పొందే నాన్ మైనారిటీ విద్యార్థుల కోసం పాఠశాల ఆవరణలో శనివారం ఉదయం 10 గంటలకు లక్కీడ్రా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

కార్మిక చట్ట సవరణలపై ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న యువరాజు

నర్సంపేట : కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం చేసిన కార్మిక చట్ట సవరణలపై ఉద్యమించాలని బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు కోరారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో హమాలీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొల్లూరి లక్ష్మీనారాయణ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో యువరాజు మాట్లాడారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం సవరించిందని, కార్మికుల హక్కులను కాలరాసిందని విమర్శించారు. ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని, కనీస వేతన చట్టం, హక్కుల కోసం పోరాడే సమ్మె హక్కులను కేంద్రంలోని బీజేపీ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా సవరించిందని తెలిపారు. కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మే డేను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ డివిజన్ అధ్యక్షుడు బొల్లం ప్రసాద్, నాయకులు గాండ్ల రాములు పాల్గొన్నారు.

ప్రతీ ఇల్లు పుస్తక నిలయం కావాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏసీపీ

నర్సంపేట : ప్రతి ఇల్లు పుస్తక నిలయంగా మారాలని స్థానిక ఏసీపీ కిరణ్‌కుమార్ ఆకాంక్షించారు. లీడ్ లైబ్రరీ అండ్ లిటరరీ సెంటర్ వ్యవస్థాపకుడు కాసుల రవికుమార్ 'మై హోమ్-మై లైబ్రరీ ఛాలెంజ్'కి శ్రీకారం చుట్టగా పోస్టర్‌ను ఏసీపీ కిరణ్‌కుమార్ గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. పిల్లలకు బాల్యం నుంచే పుస్తక పఠనాన్ని అలవర్చాలని తల్లిదండ్రులకు సూచించారు. లీడ్ లైబ్రరీ గతంలో ప్రారంభించిన 'హగ్ ఏ బుక్ ఛాలెంజ్' కు స్పందన లభిస్తోందని చెప్పారు. ప్రస్తుతం 'మై హోమ్-మై లైబ్రరీ' నినాదంతో విద్యార్థులు సొంతంగా ఇంట్లోనే గ్రంథాలయాలను ఏర్పాటు చేసుకోవాలని సవాలు విసరడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులు సవాలును స్వీకరించి ఇళ్లలోనే గ్రంథాలయాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. దేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్న ప్రస్తుత తరుణంలో అభివృద్ధి చెందిన దేశాల్లోనూ పుస్తక పఠనానికే మొదటి ప్రాధాన్యత ఉందన్నారు. రవికుమార్ మాట్లాడుతూ.. ఇంట్లోనే గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకునే విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులతోపాటు మరిన్ని పుస్తకాలను అందిస్తామని చెప్పారు. పుస్తక పఠనంతోనే విద్యార్థుల మెదడు, ఆలోచన చురుకుగా తయారు అవుతుందని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

మే డే వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

నయీంనగర్: మే డే ఉత్సవాలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు పిపులునిచ్చారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను హనుమకొండ పెగడపల్లి డబ్బాల్ సెంటర్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా సమితి అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఖండించాలన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించి గద్దెదించే విధంగా కార్మికవర్గం ఐక్యం కావాలని సూచించారు. అన్నిచోట్ల జెండాలు ఎగురవేసి మేడే స్ఫూర్తిని చాటాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుంటి రాజేందర్, జనార్దన్, రవి, రమేష్, సతీష్, పూజారి, దేవేందర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

నర్సంపేట : ఓటు ద్వారానే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించగలమని ఏపీలోని పుత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.గోపాల్ రెడ్డి తేటతెల్లం చేశారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, పొలిటికల్ సైన్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన అవగాహన సదస్సుకు గోపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఓటర్లు ప్రలోభాలకు గురి కాకుండా మెరుగైన పాలన అందించగల నాయకులకు ఓటేయాలని సూచించారు. అర్హులందరూ ఖచ్చితంగా ఓటేయాలని చెప్పారు. ఓటుకు ఉన్న శక్తిపై ప్రజలను చైతన్యవంతం చేయాలని విద్యార్థులకు సూచించారు. సదస్సులో కళాశాల ఐక్యూసీ సమన్వయకర్త డాక్టర్ ఏ.శ్రీనాథ్, ఎన్ఎస్ఎస్ జిల్లా అధికారి డాక్టర్ ఐ.శివనాగ శ్రీను, కళాశాల ప్రోగ్రాం అధికారి డాక్టర్ బి.రమేశ్, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఎం.శైలజ, టి.రమేశ్, ఎల్.సత్యనారాయణ, డాక్టర్ బి.విష్ణుకుమార్, డాక్టర్ జి.ప్రసూన, ఎం.సమ్మయ్య పాల్గొన్నారు.

రెడ్డి సంఘం సభను విజయవంతం చేయాలి

- జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి



దామెర : మే 2న భీమారం కేఎల్ఎన్ గార్డెన్‌లో నిర్వహించే రెడ్డి సంఘం కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని దుర్గంపేట్ సమీపంలో గల ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో వరంగల్ ఉమ్మడి జిల్లా కృతజ్ఞత సభను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సభకు రెడ్డి సామాజికవర్గాని చెందినవారు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కేతిపల్లి శ్రీధర్‌రెడ్డి, నాయకులు వీసం రమణారెడ్డి, మన్నెం ఇంద్రారెడ్డి, మండల నాయకులు రవీందర్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక



ఆత్మకూరు : యూత్ కాంగ్రెస్ ఆత్మకూరు గ్రామ కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుక్కల రమేష్, ఉపాధ్యక్షులుగా బరుపట్ల అన్వేష్, దుగ్యాల కిరణ్, ప్రధానకార్యదర్శిగా ఎల్లబోయిన శ్రీశైలంయాదవ్, సహాయ కార్యదర్శులుగా మహ్మద్ లియాజ్, నమతాబాజీ అభిలాష్, కోశాధికారిగా వడ్డెపల్లి అనిరుద్‌ను ఎన్నుకున్నారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు పర్వతగిరి రాజు, మాదాసి శ్రీధర్, మత్స్యశాఖ చైర్మన్ బయ్య తిరుపతి, తనుగుల సందీప్, బయ్య కుమార్, రేవూరి జయపాల్‌రెడ్డి, బరుపట్ల కిరీటి, వెల్దె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.